సాక్షి
వికారాబాద్
శనివారం ၊ 5 ၊ జూలై ၊ 2025



నాటు కోడికి భలే డిమాండ్

ఆషాఢమాసం కావడంతో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. వీటి ధరను అమాంతం పెంచేశారు. 8లో ▸



తప్పుల్లేకుండా ఓటరు జాబితా

తప్పులకు తావులేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. 8లో ▸



పేదల సంక్షేమమే..

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి



మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాండూరు టౌన్: మున్సిపల్ కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులు, సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం చెత్త సేకరణ, తరలింపు తదితర పనుల వల్ల అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. తరచూ జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధుల బారిన పడుతుంటారని తెలిపారు. కార్మికులు ఎలాంటి అనారోగ్యం పాలైనా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా సిబ్బందితో పాటు, కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ కుమార్, మెప్మా టీఎంసీ రాజేందర్, జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



వ్యాపారి ఇంట పూసిన బ్రహ్మ కమలాలు

తాండూరు టౌన్: పట్టణంలోని ఓ వ్యాపారి ఇంట్లో బ్రహ్మ కమలాలు విరబూసాయి. ఏడాదికి ఒక్కసారి పూలు పూసే ఆ చెట్టుకు శుక్రవారం ఏకంగా ఏడు కమలాలు పూశాయి. పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన వ్యాపారి పునీత్ కుమార్ ఇంట్లో ఈ అరుదైన విషయం చోటు చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు చెట్టు వద్ద పూజలు చేశారు. ఒకేసారి ఏడు పుష్పాలు పూయడం అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు.

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

ధారూరు: మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాస్టర్స్ ట్రైనర్స్ బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సుధీర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని బీఎల్‌ఓలు సకాలంలో హాజరు కావాలనీ ఆయన సూచించారు.

జాతీయ రక్షణ నిధికి రూ.3లక్షల విరాళం



ఆర్బీఓఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు/యాలాల: జాతీయ రక్షణ నిధికి ఆర్‌బీఓఎల్ తరఫున రూ.3 లక్షల విరాళం అందజేసినట్లు కంపెనీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు రక్షణ శాఖకు తమ కంపెనీ తరఫున ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతినెలా జాతీయ రక్షణ నిధికి తమ వంతు సాయం అందజేస్తామని ఆయన తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

బొంరాస్‌పేట: చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బొంరాస్‌పేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్య నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎంఈఓ హరిలాల్, నాయకులు నర్సింలుగౌడ్, రాంచంద్రారెడ్డి, అధ్యాపకులు దినేశ్, సురేశ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యర్థం.. అనర్థం

మున్సిపాలిటీల్లో ఇష్టారాజ్యంగా చెత్త డంపింగ్

పారిశుద్ధ్య మెరుగుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో చెత్త సమస్య తీరడం లేదు. స్వచ్ఛభారత్.. స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. మున్సిపాలిటీల్లో చెత్త సమస్యలు, డంపింగ్ యార్డుల నిర్వహణలో లోపాలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా తీరని సమస్య
- కంపుకొడుతున్న కాలనీలు
- కానరాని కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్లు
- వికారాబాద్‌లో నిరుపయోగంగా చెత్తశుద్ధి పరికరాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పరిగి పట్టణ పరిధిలోని జింకన్న గ్రౌండ్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

వికారాబాద్: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో చెత్త సమస్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఇళ్లు, వీధుల్లో సేకరించిన చెత్తను పట్టణ శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. పట్టణంలో చెత్త కుండీలు తీసివేయటంతో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. ఇళ్ల వద్దకు చెత్త వాహనాలు సక్రమంగా రావడం లేదని పలు కాలనీల ప్రజలు తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. మున్సిపల్ అనుబంధ గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ముక్కుపిండి పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా చెత్తను డంప్ చేస్తుండటంతో అది కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. తడి పొడి చెత్తను కలిపే సేకరిస్తున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 34 వార్డులు.. 80 వేల జనాభా ఉంది. రోజుకు సగటున 30 నుంచి 32 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. చెత్త తరలింపు కోసం రెండు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లు, 17 ఆటోలు వినియోగిస్తున్నారు. 157 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. గతంలో కంపోస్టు ఎరువు తయారీ చేపట్టిన అధికారులు ఇప్పుడు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం అన్ని కాలనీల్లో చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. మార్కెట్, రైతు బజార్ పరిసర ప్రాంతాల్లో చెత్త పారబోస్తున్నారు. వికారాబాద్ – అనంతగిరి మార్గంలో మేకల గండి వద్ద చెత్త డంపింగ్ యార్డు చేస్తున్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

పరిగి: మున్సిపల్ పరిధిలో చెత్త నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డు లేదు. డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించినా కొన్ని సమస్యల కారణంగా దాన్ని వినియోగించుకోవడం లేదు. ప్రస్తుతం ప్రైవేటు స్థలాల్లో చెత్త నిల్వ చేస్తున్నారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ పరిధిలో 30వేల మందికి పైగా జీవిస్తున్నారు. రోజూ ఎనిమిది టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 78 మంది పారిశుద్ధ్య కార్మికులు పనులు చేస్తున్నారు. చెత్త సేకరణకు 10 వాహనాలు, 3 ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. మండల పరిధిలోని రంగాపూర్ సమీపంలో డంపింగ్ యార్డు నిర్మాణం కోసం శిలాఫలకం వేశారు. భూ వివాదం కారణంగా డంపింగ్ చేయడం ఆపేశారు. ప్రస్తుతం సుల్తాన్‌పూర్ సమీపంలో చెత్తను డంప్ చేస్తున్నారు. పట్టణంలో చెత్త సేకరణ సరిగ్గాలేదని పలు కాలనీల ప్రజలు తెలిపారు.



వికారాబాద్ డంపింగ్ యార్డ్‌లో నిరుపయోగంగా చెత్త శుద్ధి పరికరాలు

జాతీయ రహదారి పక్కనే..



రోడ్డు పక్కనే చెత్త డంపింగ్

కొడంగల్: పట్టణ శివారు కొడంగల్ – మహబూబ్ నగర్ జాతీయ రహదారి పక్కనే చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల వాసులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. డంపింగ్ యార్డు సమీపంలో రెండు ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు తెలిపారు. 2018లో కొడంగల్ మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. నాటి నుంచి నేటి వరకు డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయలేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. కొడంగల్, కొండారెడ్డిపల్లి, ఐనన్‌పల్లి, బూల్కాపూర్, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట గ్రామాలను కలిపి మున్సిపల్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 20 వేల జనాభా ఉంది. జనాభాకు తగినంతగా మౌలిక సదుపాయాలు లేవు. చెత్త సేకరణకు ఆరు ఆటోలు, ఒక ట్రాక్టర్ ఉన్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను బూల్కాపూర్ దగ్గర కేటాయించిన డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. అయితే అక్కడికి సరైన దారి లేదని వినియోగించడం లేదు. పట్టణ శివారులోని కోస్గి రోడ్డు పక్కన చెత్తను వేస్తున్నారు. ఒకవైపు వాహనాల కొరత.. మరోవైపు నిధుల సమస్య పాలనను కుంగదీస్తోంది. మెరుగైన పాలన అందించడానికి ఆటంకంగా మారింది. కొడంగల్ మున్సిపల్ పరిధిలో దోమల బెడద అధికంగా ఉంది. మురుగు కాల్వల్లో దోమలు పెరిగి ప్రజల అనారోగ్యం బారిన పడుతున్నారు.

నిర్వహణ గాలికి..

తాండూరు: మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను ఎరువుగా మార్చడంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఇళ్లు, వీధుల్లో సేకరించిన వ్యర్థాలను పట్టణ శివారులోని డంపింగ్ యార్డుకు తరలించి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోతోంది. తాండూరు మున్సిపల్ పరిధిలో 36వార్డులు, 19వేలగృహాలు, 85వేల జనాభా ఉంది. 254 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి నిత్యం 40 టన్నుల చెత్త వస్తోంది. దాన్ని పట్టణ శివారులో గల అంతారం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చెత్త సేకరణకు 11 ట్రాక్టర్లు, 28 ఆటోలు ఉండగా సగానికి పైగా పని చేయడం లేదు. నాలుగేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ప్రమాణాలు పాటించిన మున్సిపాలిటీలకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందజేస్తోంది. మూడేళ్లుగా తాండూరు చివరి స్థానంలో నిలవడం గమనార్హం.



తాండూరు పట్టణంలోని బస్వణ్ణకట్ట పక్కన పారబోసిన చెత్త



కొడంగల్‌లో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీజీపీ జితేందర్ తదితరులు

మత్తుకు బానిసలు కావొద్దు

- గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం
- డీజీపీ జితేందర్

కొడంగల్: తెలంగాణను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. శుక్రవారం కొడంగల్‌లో సీఐ కార్యాలయానికి, కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ల నూతన భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి, గంజాయి చాక్లెట్లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మత్తు పదార్థాలు తెస్తున్న వారిపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. వ్యసనాలకు గురికావడం వల్ల కుటుంబాలు చెల్లాచెదురవుతాయని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. బొంరాస్‌పేటలో పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణానికి రూ.2.96 కోట్లు, దుద్యాల్ పోలీస్‌స్టేషన్‌కు రూ.3 కోట్లు, కొడంగల్ సీఐ కార్యాలయానికి రూ.85 లక్షలు,కొడంగల్ పోలీస్ స్టేషన్‌కు రూ.2.96 కోట్లు కేటాయించారు. అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మిస్తామని డీజీపీ తెలిపారు. భవనాలను త్వరగా నిర్మించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసులు డీజీపీకి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఐజీ తాఫ్సీర్ ఎగ్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజీ రమేష్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, తహసీల్దార్ విజయ్ కుమార్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోయే వారికి న్యాయం చేస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన పట్టణంలోని జాతర స్థలాన్ని సందర్శించారు. ఇండ్లు కోల్పోతున్న వారి కోసం జాతర స్థలంలో వెంచర్ చేస్తున్నారు. ఆ వెంచర్‌లో అన్ని సౌకర్యాలతో కూడిన ఇంటి స్థలాలను కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. విశాలమైన రోడ్లు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పరిగి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడంతోపాటు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం పరిగి పట్టణంలో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. పనుల వేగంపెంచి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

అనంతగిరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ఇందిరమ్మ, బుడగ జంగం కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

శంషాబాద్ డీసీపీ రాజేష్

కొత్తూరు: ప్రజల సహకారంతోనే పూర్తిస్థాయిలో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. కొత్తూరు పట్టణంలో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం పలు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్‌లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణంలో చేపట్టిన తనిఖీల్లో సరైన ధ్రువీకరణ లేని వాహనాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని, అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న దుకాణాల్లో సిలిండర్లు, పెంజర్ల రోడ్డులోని ఓ టీకొట్టులో సుమారు 84 గంజాయి చాక్లెట్లు, ఆయా పాన్‌డబ్బాలు, కిరాణా దుకాణాల్లో సుమారు 10 కిలోల గుట్కాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్థానికంగా రౌడీషీటర్లు, సస్పెక్టెడ్ షీటర్ల వివరాలు, వారి కదలికలను తెలుసుకున్నట్లు వెల్లడించారు. పలువురికి డ్రగ్స్ పరీక్షలు సైతం నిర్వహించినట్లు తెలిపారు. కొత్తూరుతో పాటు సమీప మండలాల్లో పారిశ్రామికవాడ ఉండడంతో బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌తో పాటు ఆయా రాష్ట్రాలకు చెందిన వలసదారులు స్థానికంగా నివాసం ఉంటున్నారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరినైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, కొత్తూరు సీఐ నర్సింహారావు, ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కూరగాయల హబ్‌గా మారుస్తాం

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: మహా నగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాను కూరగాయల, ఆకుకూరల హబ్‌గా మార్చడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి పేర్కొన్నారు. కూరగాయలు, ఆకుకూరల సాగు పెంపు కోసం రైతు కమిషన్ పైలెట్ కింద ఎంపిక చేసిన మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయనతో పాటు సభ్యులు గోపాల్‌రెడ్డి, కేవీఎన్ రెడ్డి, గంగాధర్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమల శాఖ అధికారి సురేష్ పర్యటించారు. మొండిగౌరెల్లిలో పుదీన, పలు రకాల ఆకుకూరలు పండిస్తున్న రైతులను కలిసి పెట్టుబడులు, ఆదాయం, మార్కెట్‌కు తరలింపు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. చౌదర్‌పల్లిలో ఆదర్శ రైతు కాశమల్ల రాములు వ్యవసాయ క్షేత్రంలో యంత్రాల ద్వారా సాగు చేస్తున్న పద్ధతిని పరిశీలించారు. కూరగాయల సాగులో జిల్లా రైతులు సీఎం రేవంత్‌రెడ్డి మనసును దోచినట్లు తెలిపారు. కాగా, మొండిగౌరెల్లి గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో కలుపుతామని, రైతుల్లో ఆందోళన అవసరం లేదని కోదండరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, రైతులు గౌర నర్సింహ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- డీఎంహెచ్‌ఓ లలితాదేవి
- పలు ఆస్పత్రుల సందర్శన

కొడంగల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రోగులకు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఫాతిమా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దౌల్తాబాద్: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. నెలలు నిండిన గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌యాదవ్, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య ఉన్నారు.



దౌల్తాబాద్: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ లలితాదేవి

రోగులకు ఇబ్బంది కలగొద్దు

దుద్యాల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలని డీఎంహెచ్‌ఓ లలితాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించారు.



కొడంగల్: రోగితో మాట్లాడుతున్న లలితాదేవి

మెరుగైన వైద్యం మన బాధ్యత

బొంరాస్‌పేట: రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడం మన బాధ్యత అని డీఎంహెచ్‌ఓ లలితాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. వసతులపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, మండల వైద్యాధికారి హేమంత్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

పూడూరు: భూమి ఉన్న ప్రతిఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి తులసీరాం సూచించారు. వ్యక్తికి ఆధార్ కార్డు ఉన్నట్లుగా పట్టదారు పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ నంబర్ వస్తుందని అన్నారు. ఐడీ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పట్టదారు పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్‌తో మండలలోని క్లస్టర్‌లోని వ్యవసాయ అధికారులను సంప్రదించి రిజిస్ట్రీని చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పాఠశాలలో బండరాళ్ల తొలగింపు



పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో పాఠశాల అభివృద్ధి జరుగుతుందని హెచ్‌ఎం నర్సానాయక్, యువ నాయకుడు రాముయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెంగోల్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఉన్న బండరాళ్లను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల్లో 350 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 20 ఏళ్ల బడి ఆవరణలో బండరాళ్లు ఉండటంతో విద్యార్థులు క్రీడాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో రూ.15 లక్షల నిధులు మంజూరు చేయడంతో వాటిని తొలగిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివేకానంద సంఘం సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర క్రీడా పాఠశాలకు విద్యార్థి ఎంపిక



రాథోడ్ ప్రవీణ్

దుద్యాల్: మండల పరిధిలోని చెట్టుపల్లి తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన రాథోడ్ ప్రవీణ్ రాష్ట్ర క్రీడా స్కూల్‌కు ఎంపికయ్యాడని ఎంఈఓ విజయ రామారావు శుక్రవారం వెల్లడించారు. ప్రతి సంవత్సరం క్రీడా పాఠశాలలకు పోటీలు నిర్వహించి మండల, జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి సిఫార్సు చేస్తారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా పాఠశాల ఎంపికలో నాలుగో తరగతి చదువుతున్న రాథోడ్ ప్రవీణ్ అథ్లెటిక్‌లో సత్తా చాటి ఎంపికయ్యాడు. దీంతో ఎంఈఓ, ఉపాధ్యాయుడు దిలీప్, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

మోమిన్ పేట: ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మంజూరైన లబ్ధిదారులకు వెంటనే ముగ్గు వేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త ఉండాలని సూచించారు. వారంలో ఒకరోజు తప్పనిసరిగా వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని చెప్పారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాటు కోడికి భలే డిమాండ్

బోనాల వేళ పెరిగిన కొనుగోళ్లు

- అమ్మవారి మొక్కుల సమర్పణకు విరివిగా వినియోగం
- వన భోజనాల్లో నాటుకోడి కూరకు ప్రత్యేకత



హస్నాబాద్ గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న నాటు కోళ్లు

దుద్యాల్: ఆషాఢమాసం నేపథ్యంలో నాటు కోళ్లకు భలే డిమాండ్ పలుకుతోంది. ప్రస్తుత సీజన్‌లో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకోవడంతో పాటు వన భోజనాలకు వెళ్తుంటారు. ఈ సమయంలో మాంసాహార ప్రియులు నాటుకోడి కూర తినేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారు. తమ కోర్కెలు తీరిస్తే బోనంతో పాటు నాటుకోడిని సమర్పిస్తామంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు మొక్కుతారు. ఈకారణంగా నాటు కోడికి పల్లెలు, తండాలు, గూడేల్లో క్రేజ్ బాగా పెరిగింది. దీంతో వీటి ధరలు పెరిగాయి. గతంతో పోలిస్తే బ్రాయిలర్ కోళ్ల పెంపకం భారీగా పెరగగా, నాటు కోళ్ల పెంపకం బాగా తగ్గిపోయింది. నాటు కోడి మాంసంపై ఆసక్తి చూపే వారు ఎక్కువగా ఉండటం, కోళ్లు అందుబాటులో లేకపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వీటి రేటు ఏకంగా మేక మాంసంతో పోటీ పడుతూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కిలో మటన్ రూ.650 ఉండగా కిలో మాంసం కలిగిన నాటుకోడి ధర రూ.600 నుంచి రూ.700 వరకు పలుకుతోంది. నాటు కోడికి మాంసానికి ఉండే రుచే వేరని, మేక మాంసం కూడా దీని ముందు దిగదుడుపేననే భావన వ్యక్తమవుతోంది. దీంతో సంపన్నులు, మధ్యతరగతి వారు ధర కొంచం ఎక్కువైనా నాటు కోడికే సై అంటున్నారు. ఇంత ధర పెట్టి కొనలేని పేదలు అమ్మవారి మొక్కులకు సైతం బ్రాయిలర్ కోళ్లతోనే తీర్చేసుకుంటున్నారు.

బ్రాయిలర్ కోళ్ల ధరకు రెట్టింపు

బ్రాయిలర్ కోళ్ల ధరతో పోలిస్తే నాటు కోళ్లకు ధర రెట్టింపు ఉంటోంది. బ్రాయిలర్ కోడి కిలో (స్కిన్ లెస్) రూ.250 ఉండగా నాటు కోడి మాత్రం రూ.500 పైమాటే అంటున్నారు. ఇదే అదునుగా నాటు కోడి ధరలు మరింత పైపైకి దూసుకుపోతున్నాయి. అయినప్పటికీ అవసరం మేర దొరకడం లేదు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం కేసులో నలుగురికి రిమాండ్

- వివరాలు వెల్లడించిన పరిగి డీఎస్పీ శ్రీనివాస్
- అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదని హెచ్చరిక



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నలుగురు యువకులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో గత నెల 21న గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదే గ్రామానికి చెందిన హరివర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మృతుడి అన్న బ్రహ్మం తన తమ్ముడి ఫొటోతో కూడిన శ్రద్ధాంజలి ఫ్లెక్సీని అంబేడ్కర్ విగ్రహం వద్ద కట్టించాడు. చాలా రోజులు గడవడంతో స్థానికుడైన ఓ వ్యక్తి ఫ్లెక్సీని తొలగించాడు. తన తమ్ముడి ఫొటోను తొలగించాడని కోపం పెంచుకున్న బ్రహ్మం స్నేహితులైన మహేశ్, సూర్యప్రకాశ్, రమేశ్‌తో కలిసి గత నెల 21న అర్ధరాత్రి సమయంలో చౌరస్తా వద్దకు చేరుకున్నారు. బ్రహ్మం రాయితో విగ్రహాన్ని ధ్వంసం చేయగా మిగిలిన ముగ్గురు ఎవరైనా వస్తే చెప్పేందుకు కాపలాగా ఉన్నారు. విచారణలో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు నలుగురినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని డీఎస్పీ హెచ్చరించారు. అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, కిరాణా దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, రమేశ్‌ను అభినందించారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు పదేళ్ల జైలు

- అదనపు కట్నం కేసులో న్యాయమూర్తి తీర్పు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణ రెడ్డి



తాండూరు టౌన్: వరకట్నం వేధింపులతో పాటు భార్య మృతికి కారణమైన కేసులో భర్తకు పదేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్పీ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018లో జరిగిన ఈ ఘటనకు బాధ్యుడైన వ్యక్తిని దోషిగా నిర్ధారిస్తూ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తీర్పు వెల్లడించారని పేర్కొన్నారు. తాండూరు పట్టణానికి చెందిన చాకలి చంద్రమ్మ రెండో కూతురు అనూషకు దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన చాకలి అరుణ్‌తో 2018 ఏప్రిల్‌లో వివాహం జరిగింది. ఈసమయంలో వరకట్నంగా రెండున్నర తులాల బంగారం, రూ.81 వేల నగదు అరుణ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. వివాహం జరిగిన కొంత కాలానికే అదనపు కట్నం తేవాలంటూ అరుణ్ భార్యను ఒత్తిడి చేశాడు. అంతేకాకుండా ఆమెపై అనుమానం పెంచుకుని, మానసికంగా వేధించాడు. ఇది భరించలేక వివాహమైన నాలుగు నెలలకే అనూష ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి తాండూరు టౌన్ సీఐ ప్రతాపలింగం దర్యాప్తు చేపట్టారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి అరుణ్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల పాటు కఠిన కారాగార శిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను ఎస్పీ అభినందించారు. వరకట్న వేధింపులకు పాల్పడే వారికి ఇది ఓ హెచ్చరికగా నిలుస్తుందని తెలిపారు.

లారీ కిందికి దూసుకెళ్లిన బైక్

- చెలరేగిన మంటలు
- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



లారీ కిందకు బైక్ దూసుకెళ్లడంతో చెలరేగిన మంటలు

పరిగి: లారీ–బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయలైన సంఘటన మండల పరిధిలోని సయ్యద్ మల్కాపూర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం బాస్పపల్లి గ్రామానికి చెందని నర్సింహులు, మైలారం గ్రామానికి చెందిన రాఘవేందర్ బైక్‌పై పరిగికి వెళ్తున్నారు. మార్గమధ్యలో సయ్యద్‌మల్కాపూర్ సమీపంలో లారీ వెనకాల నుంచి ఢీకొట్టింది. ఒక్కసారిగా బైక్ లారీ కిందికి వెళ్లడంతో మంటలు చెలరేగాయి. ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అటునుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ నర్సింహులు(25) మృతిచెందాడు. ప్రమాదంలో మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బంది స్పందించి మంటలార్పి పెను ముప్పును తప్పించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సబ్సిడీ పరికరాలను వినియోగించుకోవాలి

ఏడీఏ సురేంద్రనాథ్



దుద్యాల్: మామిడి పంట పునరుద్ధరణకు అవసరమయ్యే పరికరాలకు అందించే సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని ఉద్యానవన శాఖ కొడంగల్, పరిగి డివిజన్ అధికారి సురేంద్రనాథ్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 15 ఏళ్ల వయసు కలిగిన మామిడి తోటలను కత్తిరించుటకు, వాటి యాజమాన్యం చర్యలు చేపట్టేందుకు అవసరమయ్యే పరికరాలైన పెట్రోల్ పవర్ మిషన్, చెట్లు కత్తిరించే చిన్న, పెద్ద మిషన్, ఫోల్డింగ్ మిషన్ వంటి పరికరాల కొనుగోలు చేసేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి రూ.24 వేలు ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులను ఏఈవోలకు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, భూమి పట్టా పాస్‌బుక్, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్‌లతో పాటు రైతు ఫొటో సైతం ఇవ్వాలని తెలిపారు.

గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు

కోట్‌పల్లి ఎస్‌ఐ శైలజ



పట్టుబడిన గుట్కా, పాన్ మసాలా ప్యాకెట్లతో ఎస్‌ఐ శైలజ

బంట్వారం: నిషేధిత గుట్కా, పాన్ మసాలాలు ఎవరైనా విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కోట్‌పల్లి ఎస్‌ఐ శైలజ హెచ్చరించారు. శుక్రవారం ఆమె కోట్‌పల్లి మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులను ఆకస్మికంగా తనిఖీలో చేసి రూ.12 వేల విలువైన గుట్కా, పాన్ మసాలాలను పట్టుకుని సీజ్ చేశారు. తనిఖీలో భాగంగా ఇద్దరు దుకాణ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన నల్ల మట్టి ట్రాక్టర్లు

యాలాల: అనుమతులు లేకుండా చెరువులోంచి తరలిస్తున్న నల్లమట్టి ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆర్‌ఐ శివచరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పగిడియాల శివారులోని చెరువులోంచి శుక్రవారం ట్రాక్టర్లలో నల్లమట్టిని తరలిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి పరిశీలించగా, ఆరు ట్రాక్టర్లలో నల్లమట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్లను పట్టుకొని యాలాల పీఎస్‌కు అప్పగించినట్లు ఆర్‌ఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నల్లమట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌ఐ హెచ్చరించారు.


ప్రార్థనా మందిరాలతో ప్రశాంతత

మొయినాబాద్‌రూరల్: ప్రార్థనా మందిరాలు మానవుడికి మనశ్శాంతిని కలిగిస్తాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మెథడిస్ట్ చర్చి ప్రార్థనలను బిషప్ ఏ.సిమోయిన్ నిర్వహించగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, రత్నం, అనంతరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని సంపాదించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్, ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు పోచయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, నాయకులు శేఖర్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకుని మృతిచెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సోమయ్య కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా తిరుమలగిరికి చెందిన రంగబాబు(40) తన భార్య, కుమారుడితో కలిసి తుర్కయంజాల్‌లోని లక్ష్మీ గార్డెన్‌లో నివాసం ఉండేవాడు. గత కొద్ది రోజులుగా ఏ పనీ చేయకుండా ఉంటున్న రంగబాబు మద్యం, కల్లుకు బానిసయ్యాడు. శుక్రవారం ఉదయాన్నే భార్య ఎప్పటిలాగే ఇళ్లల్లో పనిచేసేందుకు వెళ్లగా, కుమారుడు ఇంట్లో లేడు. పనిముగించుకున్న అనంతరం ఉదయం 10:30 గంటలకు భార్య ఇంటికి చేరుకోగా రంగబాబు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిదపారు.

ఆషాఢ మాసం.. అమ్మకు ప్రత్యేకం



శాకాంబరీ అలంకరణలో అమ్మవారు

తాండూరు టౌన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణంలోని నగరేశ్వర దేవాలయంలో ఆర్యవైశ్య మహిళలు సంబరాలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరి మాతను తీరొక్క కూరగాయలతో అలంకరించారు. శాకాంబరీ మాత అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం కుంకుమార్చన, వారాహి దేవి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆషాఢ మాస ప్రత్యేకతకు నెలవుగా వస్తున్న గోరింటాకును మహిళలందరూ చేతులకు పెట్టుకుని వేడుకలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, వాసవి మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొత్రిక నాగలక్ష్మి, మంకాల్ స్వప్న, కోశాధికారి సంగంశెట్టి శోభ పాల్గొన్నారు.



వారాహి దేవి పూజా కార్యక్రమంలో మహిళా భక్తులు

సమస్యలు పరిష్కరించండి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి నేతల వినతి



ఎంపీ కొండాను కలిసిన తాండూరు బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని శుక్రవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టారు. తాండూరు నుంచి వికారాబాద్ వరకు రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉండటంతో నగరానికి వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షాలు కురుస్తుండటంతో ప్రయాణం నరకప్రాయంగా తయారయిందన్నారు. అలాగే పట్టణంలోని బీసీ శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోవడం లేదని, అంత్యక్రియలు చేసే చోట కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, నాయకులు శాంత్‌కుమార్, లలిత, భద్రేశ్వర్, మల్లేశం, జగదీష్, జగన్, కృష్ణ, మల్లు తదితరులు పాల్గొన్నారు.

టీబీ పీడితులు భయపడొద్దు

పీహెచ్‌సీ డాక్టర్ బుస్రా



టీబీ ముక్త్ అభియాన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: టీబీ(క్షయ) వ్యాధిగ్రస్తులు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా వైద్యుల సూచనలు పాటించాలని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బుస్రా అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇందులో 111మందికి టీబీ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. పాత టీబీ పేషంట్లు, ప్రస్తుత టీబీ పేషంట్ల కుటుంబసభ్యులకు, పొగాకు వాడేవారికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా బుస్రా మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులకు 6 నెలలపాటు ఉచిత మందులు అందించనున్నట్లు, పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.వెయ్యి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆకలి లేకపోవడం, రెండు వారాలుగా ఎడతెరిపి లేని దగ్గు, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, చమటలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నిఖిత, అశ్విని, నిర్మల, టీబీ సూపర్‌వైజర్ రాహత్‌అలీ, ఏఎన్‌ఎం మణెమ్మ పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా ఓటరు జాబితా

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్



బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు: తప్పులకు తావివ్వకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ నంబర్ 1 పాఠశాలలో నిర్వహించిన బీఎల్‌ఓల శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. శిక్షణ తరగతులకు వివరాలను తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితాలో నుంచి తొలగించాలన్నారు. సరిహద్దులో ఉన్న కర్ణాటక వాసులు నకిలీ ఓటరు నమోదు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు, అధికారులు, బీఎల్‌ఓలు తదితరులున్నారు.

తరగతి గదుల పరిశీలన

అనంతరం సబ్ కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. మెరుగైన బోధన అందివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అయ్యోపాపం అంధుడు



నిర్మాణంలో ఉన్న మురుగు కాలువ గుంతలో పడిన అంధుడు మహబూబ్

తాండూరు టౌన్: నిర్మాణంలో ఉన్న నిలువెత్తు మురుగు కాల్వలో పడి ఓ అంధుడు గాయాలపాలయ్యాడు. అదృష్టం బాగుండి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. జినుగుర్తికి చెందిన అంధుడైన మహబూబ్ నిత్యం గ్రామం నుంచి పట్టణానికి వచ్చి భిక్షాటన చేస్తుంటాడు. ఉదయాన్నే రాయల్ కాంటా సమీపంలోని దర్గా వద్ద భిక్షాటన చేశాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో విలియం మూన్ చౌరస్తా నుంచి వెళ్తూ మురుగు కాల్వ కోసం తవ్విన గుంతలో పడిపోయాడు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రణగొణ ధ్వనుల మధ్య అతని అరుపులు కొంత సేపటి వరకు ఎవరికీ వినిపించలేదు. అటుగా వెళ్తున్న పాదచారులు గమనించి కర్రల సహాయంతో అతన్ని బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహబూబ్ పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.